సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం । 28 । జనవరి । 2025



చీనీ టన్ను రూ.15 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీ గరిష్ఠంగా రూ.15 వేలు, కనిష్ఠంగా రూ.9 వేలు, సరాసరిన రూ.10 వేల ప్రకారం ధర పలికాయి.



ప్రభుత్వ విద్య.. ఇకపై మిథ్య
విద్యార్థుల సంఖ్యను సాకుగా చూపుతూ పలు పాఠశాలలను మూసివేసేందుకు కూటమి సర్కార్ సిద్ధమైంది. అదే జరిగితే నిరుపేదలకు విద్య దూరం కానుంది. 8లో



జిల్లా వ్యాప్తంగా సోమవారం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

- కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశం
- ధర్మవరం ఆస్పత్రి తనిఖీ



దయాలసిస్ రోగికి అందిస్తున్న వైద్య సేవలను పరిశీస్తున్న కలెక్టర్ చేతన్

ధర్మవరం అర్బన్: ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా రోగులకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ వైద్యులను ఆదేశించారు. సోమవారం ఆయన ధర్మవరం పట్టణంలో సుడిగాలి పర్యటన చేశారు. ఆకస్మిక తనిఖీలు చేసి సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. తొలుత పట్టణంలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో ఎంత మంది డయాలసిస్ చేయించుకుంటున్నారని సూపరింటెండెంట్ మాధవిని ప్రశ్నించారు. ఆస్పత్రిలో 21 మంది డయాలసిస్‌కు నమోదు చేయించుకున్నారని, ప్రస్తుతం 16 మందికి డయాలసిస్ చేశామని ఆమె కలెక్టర్‌కు విన్నవించారు. అనంతరం కలెక్టర్ చేతన్... ఆస్పత్రిలోని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అక్కడి నుంచి కలెక్టర్ నేరుగా మార్కెట్ యార్డులోనున్న ఈవీఎం గోడౌన్‌కు వెళ్లారు. గోడౌన్‌కు వేసిన సీల్‌ను పరిశీలించి భద్రతపై ఆరా తీశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంపై ఆరా తీశారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ మహేష్, తహసీల్దార్ నటరాజ్ తదితర అధికారులు ఉన్నారు.

గోరంట్ల ఎస్‌ఐ సస్పెన్షన్

- నార్సింపల్లి ఘటనలో నిర్లక్ష్యానికి ఎస్పీ చర్యలు



పుట్టపర్తి టౌన్: గోరంట్ల ఎస్‌ఐ బాబును సస్పెండ్ చేస్తూ ఎస్పీ రత్న సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గోరంట్ల మండలం నార్సింపల్లి గ్రామంలో ఓ ప్రేమ వ్యవహారం.. తదనంతరం పరిణామాలకు ఎస్‌ఐని బాధ్యున్ని చేస్తూ ఎస్పీ చర్యలు తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. గోరంట్ల మండలం నార్సింపల్లి గ్రామానికి చెందిన ఓ బాలికను అదే గ్రామానికి చెందిన యువకుడు ప్రేమించాడు. కులాలు వేరుకావడంతో తమ ప్రేమను పెద్దలు అంగీకరించరని భావించిన ప్రేమజంట మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయింది. అయితే వారి ఆచూకీ కనిపెట్టిన బంధువులు, కొందరు గ్రామస్తులు ప్రేమజంటను గ్రామానికి తీసుకువచ్చారు. అనంతరం యువకుడిని స్తంభానికి కట్టేసి కొట్టారు. ముఖంపై పేడ నీళ్ల చల్లి దాడి చేశారు. ఈ ఘటనను ఎస్పీ రత్న తీవ్రంగా పరిగణించి డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ శేఖర్, సిబ్బందితో కలిసి గ్రామాన్ని సందర్శించారు. బాలికను తీసుకెళ్లిన యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. అనంతరం ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎస్‌ఐ బాబును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి



పుట్టపర్తి టౌన్: జిల్లాలో ఈడిగ, గౌడ, ఇతర ఉపకులాలకు కేటాయించిన 9 మద్యం షాపులకు ఫిబ్రవరి 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ జిల్లా అధికారి గోవిందనాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్లుగీత కులాల వారికి మద్యం షాపులు రిజర్వ్ చేస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వగా, లాటరీ ద్వారా మొత్తం 9 షాపులు ఆయా వర్గాలకు కేటాయించినట్లు వెల్లడించారు. అర్హులైన వారు రూ.2 లక్షలు నాన్ రిఫండబుల్ చలానా, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, కుల ధ్రువీకరణ పత్రంతో ఫిబ్రవరి 5వ తేదీలోపు ఆన్‌లైన్‌లో హైబ్రిడ్ పద్ధతిలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 6వ తేదీ దరఖాస్తుల పరిశీలన, ఉంటుందని, 7వ తేదీ కలెక్టరేట్‌లో లాటరీ తీసి దుకాణాలు కేటాయిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు పుట్టపర్తి సమీపంలోని ఉజ్వల ఫౌండేషన్ ఆవరణలో ఉన్న జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

కరెంటు కోత.. రైతు వ్యథ





ఈ చిత్రంలోని రైతులు రొళ్ల మండలం హనుమంతనపల్లి, రొళ్లగొల్లహట్టి తదితర గ్రామాలకు చెందిన వారు. నాలుగు రోజులుగా హెచ్‌ఎం పల్లి ఫీడర్ కింద రోజుకు రెండు గంటలు కూడా త్రీఫేస్ కరెంటు సరఫరా కాకపోవడంతో బోరుబావుల కింద సాగు చేస్తున్న రాగి, వేరుశనగ, మొక్కజొన్న, మల్బరీ, దానిమ్మ తదితర పంటలన్నీ ఎండుముఖం పట్టాయి. దీంతో రైతులంతా సోమవారం రొళ్ల సబ్ స్టేషన్ ముట్టడించారు. వ్యవసాయానికి తొమ్మిది గంటల పాటు నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వేసవి రాక ముందే కోతలు పెడితే ఎలా అని నిలదీశారు.

- జిల్లా వ్యాప్తంగా పెరిగిన కరెంటు కోతలు
- వ్యవసాయానికి అందని నాణ్యమైన విద్యుత్
- డీపీల్లేక.. కొత్త లైన్లు వేయక తీవ్ర ఇబ్బందులు
- పంటలు ఎండుతుండగా రైతుల ఆక్రందన
- వ్యవసాయాధారిత జిల్లాలో దారుణమైన పరిస్థితి

సాక్షి ప్రతినిధి, అనంతపురం: 'రైతులందరూ మీ పొలాల్లో మీరే కరెంటు ఉత్పత్తి చేసుకోవచ్చు. మీరు వాడుకోగా మిగిలింది ప్రభుత్వానికి ఇచ్చేలా చేస్తాం. కరెంటు చార్జీలు పెరగవు. రైతులను సంపద సృష్టించే విధంగా తీర్చిదిద్దుతాం' అంటూ ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీ ఒట్టి మాటగానే మిగిలిపోయింది. కూటమి సర్కారు అంతులేని అలసత్వం కారణంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో కరెంటు కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. రబీ పంటలకు కీలకమైన ఈ సమయంలో కరెంటు సరఫరాలో కోతలు విధిస్తున్నారు. దీంతో బోర్ల కింద పంటలు పండించుకునే రైతన్నలు కరెంటు కోతలతో అల్లాడిపోతున్నారు. ధర్మవరం, పుట్టపర్తి, మడకశిర నియోజకవర్గాల్లో విద్యుత్ కార్యాలయాల ఎదుట ధర్నాకు దిగుతున్న పరిస్థితి నెలకొంది. రైతులు వినతిపత్రాలు ఇస్తున్నా.. అధికారుల్లో ఎలాంటి స్పందనా లేకపోవడంతో తీవ్ర ఆవేదన చెందుతున్నారు.



విద్యుత్ కోతలు నిరసిస్తూ ఈనెల 16వ తేదీన అగళి మండలం హెచ్‌డీహళ్లి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు

విద్యుత్ కనెక్షన్ల పెండింగ్..

పంటలు పెట్టుకుందామనే ఆశతో కొత్తగా బోర్లు వేయించుకుని.. విద్యుత్ కనెక్షన్ కోసం అధికారుల వద్దకు వెళ్తున్న జిల్లా రైతులకు నిరాశే మిగులుతోంది. ట్రాన్స్‌ఫార్మర్లు, కరెంటు పోళ్లు, వైర్లు లేవని చెబుతుండటంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు 15 వేల వరకూ పెండింగ్ ఉన్నాయి. ఇప్పటికే రబీ సీజన్‌లో కంది, మినుము, శనగ తదితర పంటలు వేసి భారీగా నష్టపోయిన రైతులు బోర్లకింద అయినా పంటలు వేసుకుని బాగు పడదామనుకుంటే వారి ఆశలపై కరెంటు అధికారులు నీళ్లు చల్లుతున్నారు. కాగా.. గత ప్రభుత్వంలో కరెంటు కష్టాలు ఉండేవి కాదని, వ్యవసాయ కనెక్షన్లు సులభంగా ఇచ్చేవారని రైతులు చెబుతున్నారు. నూతన ఫీడర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుతో నాణ్యమైన విద్యుత్ అందించారని, ఇప్పుడు మాత్రం పరిస్థితులు అధ్వానంగా తయారవుతున్నాయని అంటున్నారు.

స్పందించని ఎస్ఈ..

కూటమి సర్కారు ఏర్పడగానే విద్యుత్ శాఖ అనంతపురం జిల్లా ఎస్ఈగా సంపత్‌కుమార్ బాధ్యతలు తీసుకున్నారు. ఐదుగురు ఎమ్మెల్యేలు సంతకాలు చేసి మరీ ఆయన్ను తీసుకొచ్చారు. ఇంత వరకూ బాగానే ఉన్నా..విద్యుత్ సమస్యలపై కలవడానికి వెళితే కనీసం స్పందించడం లేదని రైతులు వాపోతున్నారు. ఫోన్ చేస్తే కూడా స్పందన లేదని చెబుతున్నారు. ఏళ్లు లంచాలు అడుగుతుండటంతో అల్లాడిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మీడియా ప్రతినిధులు ఫోన్ చేసినా ఎస్ఈ లిఫ్ట్ చేయకపోవడం గమనార్హం.

2019-2024 మధ్య కాలంలో విద్యుత్ సంస్కరణలు ఇలా..

కేటగిరీ	సంఖ్య	వ్యయం
వ్యవసాయ కనెక్షన్లు	94,060	--
ట్రాన్స్‌ఫార్మర్లు	9,612	రూ.270.82 కోట్లు
సబ్‌స్టేషన్లు	46	రూ.161 కోట్లు
పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు	114	రూ.53.76 కోట్లు
33కేవీ ఫీడర్లు	11	రూ.40.26 కోట్లు
11కేవీ ఫీడర్లు	19	రూ.13.93 కోట్లు
33కేవీ లైను	42.4 కి.మీ	రూ.98.83 కోట్లు
హౌసింగ్ కాలనీలు	349	రూ.88.32 కోట్లు
11 కేవీ ఫీడర్లు	593	రూ.1334.23 కోట్లు
33కేవీ కొత్త ఫీడర్లు	579.5 కిమీ	రూ.50.6 కోట్లు
కొత్త సబ్‌స్టేషన్ల ప్రతిపాదన	273	రూ.955.5 కోట్లు

విద్యుత్ కోతలు ఎక్కువయ్యాయి



హిందూపురం నియోజకవర్గ వ్యాప్తంగా విద్యుత్ కోతలు ఎక్కువయ్యాయి. వ్యవసాయానికి కూడా సరిగా సరఫరా ఇవ్వకపోవడంతో బోరుబావుల కింద సాగులో ఉన్న పంటలు ఎండుముఖం పడుతున్నాయి. నేను కూడా బోరుకింద పంట సాగు చేస్తున్నా. విద్యుత్ సరఫరా సరిగా లేక బోర్లు ఆడక పంటకు సరిగా నీరు పెట్టలేకపోతున్నా. సోమవారం కూడా విద్యుత్ వేళల్లో మార్పు చేశారు. తెల్లవారుజామున సరఫరా ఇవ్వడం వల్ల రైతులకు ఇబ్బందులు కలిగాయి.

– ప్రవీణ్ కుమార్, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు

కోతలతో రైతులకు ఇబ్బందులు



వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ ఇవ్వడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. కరెంటు ఎప్పుడు ఉంటుందో..ఎప్పుడు పోతుందో తెలియడం లేదు. పంటలకు సకాలంలో నీరివ్వకపోతే రైతుల రెక్కల కష్టం వృథా మారుతుంది. అందుకే రైతులంతా సబ్‌స్టేషన్ల వద్ద ధర్నాకు దిగుతున్నారు. అయినా ఈ ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం దుర్మార్గం. అమరాపురం మండలంలోని శివరం విద్యుత్ సబ్‌స్టేషన్ పూర్తయినా ప్రారంభించకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

– ఆనందరంగారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి

కరెంటు లేక కష్టాలు



మడకశిర నియోజకవర్గంలో కరెంటు కష్టాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వ్యవసాయానికి ఆరుగంటలే విద్యుత్ ఇస్తున్నారు. అది కూడా వేళాపాళా లేకుండా సరఫరా చేస్తున్నారు. ఇక లో ఓల్టేజీ సమస్యతో మోటార్లు కాలిపోతున్నాయి. ప్రస్తుతం పైర్లకు నీటి తడులు ఎంతో అవసరం. ఈ దశలో నీరు పెట్టకపోతే పైరు ఎదుగుదల దెబ్బతిని, దిగుబడులు తగ్గిపోతాయి. ఇప్పటికైనా అధికారులు వ్యవసాయానికి తొమ్మిది గంటల పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి.

– పనేష్,పీ బ్యాడగేర గ్రామం,అగళి మండలం

అంతటా ఆధిపత్య పోరే!

- మంత్రుల ఇలాకాల్లో కూటమి నేతల మధ్య పొసగని పొత్తు
- ధర్మవరం, పెనుకొండలో విమర్శల పర్వం
- మిగతా నియోజకవర్గాల్లో కత్తులు దూసుకుంటున్న తమ్ముళ్లు
- అధిపత్యం కోసం భౌతిక దాడులకూ సిద్ధమైన వైనం
- నేతల తీరుపై పెదవి విరుస్తున్న జనం

సాక్షి, పుట్టపర్తి

రాష్ట్రంలో కూటమి సర్కార్ కొలువుదీరాక ఆయా పార్టీల నేతల మధ్య ఆధిపత్య పోరు ఎక్కువైంది. కొన్నిచోట్ల బీజేపీ, టీడీపీ నేతలు బాహాబాహీకి దిగుతుండగా..మరికొన్ని నియోజకవర్గాల్లో టీడీపీ నేతలే రెండు వర్గాలుగా విడిపోయి కత్తులు దూసుకుంటున్నారు. ఇక కూటమిలో భాగమైనా తమను పట్టించుకోవడం లేదని జనసేన నేతలు తెగబాధపడిపోతున్నారు. అందరినీ సమన్వయపరచాల్సిన అమాత్యులూ అగ్గి రాజేస్తుండటంతో జిల్లాలో పరిస్థితి చేయిదాటుతోంది. నేతలు రోడ్డెక్కి ఘర్షణ పడుతున్న తీరు చూసి... 'అభివృద్ధి చేయమని అధికారం ఇస్తే మీరు చేసే పని ఇదా'' అంటూ జనం పెదవి విరుస్తున్నారు.

ఎప్పుడూ కలిసి లేరు..

కూటమిలోని బీజేపీ, టీడీపీ, జనసేన నేతలు ఏనాడూ కలిసి లేరు. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ప్రతి విషయంలోనూ ఆయా పార్టీల నేతల మధ్య విభేదాలు బయట పడుతున్నాయి. మద్యం దుకాణాల టెండర్లు, సాగునీటి సంఘం ఎన్నికలు, ఫీల్డ్ అసిస్టెంట్‌ల నియామకం, ఉద్యోగుల పోస్టింగులు, ప్రారంభోత్సవాలు, పార్టీలో చేరికలు.. ఇలా ప్రతి విషయంలోనూ విభేదాలు బట్టబయలు అవుతున్నాయి. రెండు రోజుల క్రితం ధర్మవరంలో జరిగిన ఘటనే ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది.



రెండు రోజుల క్రితం ధర్మవరంలో టీడీపీ, బీజేపీ నేతల మధ్య జరిగిన ఘర్షణకు సంబంధించిన చిత్రమిది. బీజేపీలో చేరికలను జీర్ణించుకోలేని టీడీపీ నేతలు ఆధిపత్య పోరుకు తెగబడ్డారు. కూటమి పార్టీల్లో సమన్వయం లోపించిందని చెప్పడానికి ఇదో ఉదాహరణ. తామంతా కలిసే పనిచేస్తున్నామంటూ నాయకులు గొప్పలు చెబుతున్నా... క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి లేదని స్పష్టంగా తెలుస్తోంది. ధర్మవరంతో పాటు పెనుకొండ, మడకశిరలోనూ 'కూటమి' పార్టీల నేతల మధ్య సఖ్యత లేనట్లు తెలుస్తోంది. ఇక పలు నియోజకవర్గాల్లో తమ్ముళ్ల మధ్యే ఆధిపత్య పోరు నడుస్తుండగా.. అభివృద్ధి కుంటుపడుతోంది.

ఆదరణ లేక అసహనం..

హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ అయినప్పటికీ.. ఆయన చుట్టపుచూపుగా నియోజకవర్గానికి వస్తారు. దీంతో అక్కడ ఉన్న బీజేపీ, జనసేన నాయకులను పలకరించే దిక్కు లేదు. పుట్టపర్తిలోనూ అదే పరిస్థితి. సింధూరారెడ్డి ఎమ్మెల్యేగా ఉండగా, ఆమె మామ పల్లె రఘునాథరెడ్డి అంతా తానై వ్యవహరిస్తున్నారు. ప్రతి సమావేశానికి హాజరవుతూ హడావుడి చేస్తున్నారు. దీంతో బీజేపీ, జనసేన కార్యకర్తలకు కేరాఫ్ అడ్రస్ లేకుండా పోయింది. కదిరిలో బీజేపీ తరఫున బడా నాయకులు ఉన్నప్పటికీ... ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్‌దే రాజ్యం.. రాజకీయం. దీంతో కదిరిలో కమలనాథులు అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో బీజేపీ, జనసేన నేతలు తమ్ముళ్లపై తీవ్ర అసహనంతో ఉన్నారు. అవసరమైతే కయ్యానికి కాలు దువ్వేందుకు సిద్ధమయ్యారు.

తమ్ముళ్ల మధ్య సఖ్యత కరువు

పెనుకొండ నియోజకవర్గంలో టీడీపీ నేతల మధ్యే సఖ్యత కరువైంది. మంత్రి సవిత, ఎంపీ పార్థసారథి మధ్య ప్రతి విషయంలోనూ రచ్చ జరుగుతూనే ఉంది. సాగునీటి సంఘం ఎన్నికల్లో రొద్దం మండలంలో గొడవ జరిగింది. అంతకుముందు మద్యం దుకాణాల టెండర్లలోనూ నెలకొన్న వివాదం పోలీస్ స్టేషన్ల వరకు వెళ్లింది. గతేడాది అక్టోబరు 6వ తేదీన సోమందేపల్లిలో ఉప్పర కులస్తుల కల్యాణమంటప భూమిపూజ విషయంలో ఆధిపత్య పోరు బహిర్గతమైంది. ఎంపీ పార్థసారథి రూ.కోటి విరాళం ఇచ్చి ప్రారంభోత్సవం చేసేందుకు సన్నాహాలు చేయగా.. మంత్రి సవిత పోలీసులను దింపి కార్యక్రమానికి భంగం కలిగించారు. ఇలా ఎంపీ, ఎమ్మెల్యే ప్రతి విషయంలోనూ ఆధిపత్య పోరు సాగిస్తుండగా.. అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. ఇక మడకశిరలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మధ్య దూరం పెరిగినట్లు తెలుస్తోంది. ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గంలో పారిశ్రామికవేత్తల పెత్తనం ఏమిటని ఎంఎస్ రాజు అధిష్టానం వద్ద వాపోయినట్లు సమాచారం.

జవాబుదారీతనం పెరగాలి

- ప్రజా సమస్యలను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలి
- అధికారులకు కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశం
- 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు 196 అర్జీలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ చేతన్

ప్రశాంత నిలయం: ''అధికారుల్లో జవాబుదారీతనం పెరగాలి. ప్రజా సమస్యల పరిష్కారంలో మరింత శ్రద్ధగా పనిచేయాలి. అప్పుడే ప్రజల్లో వ్యవస్థపై నమ్మకం ఏర్పడుతుంది. ఇందుకోసం ఆయా శాఖల అధిపతులు నిబద్ధతతో పనిచేయాలి. సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపాలి. అప్పుడు ఆయా శాఖల్లోని కిందిస్థాయి ఉద్యోగులూ క్రమశిక్షణతో పనిచేస్తారు. సమష్టిగా పనిచేస్తే ఎలాంటి సమస్యనైనా పరిష్కరించవచ్చు'' అని కలెక్టర్ చేతన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై మొత్తంగా 196 అర్జీలను అందగా, వాటి పరిష్కారం కోసం ఆయా శాఖలకు పంపారు. అనంతరం కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందే అర్జీలను క్షుణ్ణంగా చదివి అర్జీదారులు సంతృప్తి పడేలా సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. అర్జీల పురోగతిని ముఖ్యమంత్రి కార్యాలయం నిరంతరం ఆరా తీస్తుందని, ఈవిషయాన్ని గుర్తించి అధికారులు అర్జీల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. ఫిబ్రవరి నుంచి ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమం మండల ప్రత్యేక అధికారులు ఆధ్వర్యంలో చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఆర్ఓ విజయ సారథి, డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి, ఆర్డీఓ సువర్ణ, పట్టు పరిశ్రమ శాఖ జాయింట్ డైరెక్టర్ పద్మావతి, ఆ శాఖ జీఎం నాగరాజు, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, హౌసింగ్ పీడీ వెంకటనారాయణ, ల్యాండ్ సర్వే ఏడీఈ విజయశాంతి బాయి, ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్, డీసీహెచ్ఎస్ డాక్టర్ తిప్పేంద్ర నాయక్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి మోహన్ రావు, డీఎంహెచ్ఓ ఫిరోజ్ బేగం, గ్రామ/వార్డు సచివాలయాల నోడల్ అధికారి సుధాకర్‌రెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మంత్రి నారాయణను బర్తరఫ్ చేయాలి

- కలెక్టరేట్ ఎదుట విద్యార్థి సంఘాల నిరసన



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ప్రశాంతి నిలయం: ఫీజుల కోసం వేధిస్తూ విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమవుతున్న నారాయణ విద్యాసంస్థలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అలాగే విద్యాసంస్థల అధినేత నారాయణను మంత్రివర్గం నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలన్నారు. సోమవారం ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ, తన విద్యాసంస్థల్లోని విద్యార్థులు తరచూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నా, మంత్రి నారాయణ కనీసం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. ఫీజుల కోసం వేధించడం వల్లే విద్యార్థులు ఆత్మహత్యలకు తెగిస్తున్నారన్నారు. అన్నీ తెలిసినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఆ విద్యాసంస్థల అధినేత నారాయణ... మంత్రిగా ఉండటం వల్లే అధికారులు చర్యలకు వెనుకంజ వేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రైవేటు విద్యాసంస్థల ఆగడాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయన్నారు. కనీస సౌకర్యాలు, అనుమతుల లేకుండానే ప్రయివేట్ విద్యాసంస్థలు నిర్వహిస్తున్నా అధికారులు చోద్యం చేస్తున్నారని, వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం వారు కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్, జిల్లా కార్యదర్శి నాగార్జున, ఉపాధ్యక్షుడు బాబావలి, పవన్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహేంద్ర, కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి సాయి గౌతం, ఉపాధ్యక్షుడు హరి, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

3న 'పురం' మున్సిపల్ చైర్మన్ ఎన్నిక



హిందూపురం మున్సిపల్ కార్యాలయం

హిందూపురం: మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు రంగం సిద్ధమైంది. చైర్మన్ ఎన్నికకు సంబంధించిన షెడ్యూల్‌ను ఎన్నికల కమిషన్ సోమవారం విడుదల చేసింది. ఈ మేరకు ఈనెల 30వ తేదీన నోటిఫికేషన్, ఫిబ్రవరి 3వ తేదీ (సోమవారం) ఎన్నిక ఉంటుంది. 3వ తేదీ ఏదైనా సెలవు ఉన్నట్లయితే 4వ తేదీ (మంగళవారం) ఎన్నిక జరుపుకోవచ్చని ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఇంద్రజ రాజీనామాతో ఎన్నిక..

గత మున్సిపల్ ఎన్నికల్లో 38 వార్డులున్న హిందూపురం మున్సిపాలిటీలో వైఎస్సార్ సీపీ 30 వార్డుల్లో విజయం సాధించింది. టీడీపీ ఆరు స్థానాలకే పరిమితమైంది. ఒక స్థానంలో బీజేపీ, మరో స్థానంలో ఎంఐఎం అభ్యర్థులు గెలిచారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఇంద్రజ బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరాక జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆమె చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేశారు. దీంతో వైస్ చైర్మన్‌గా ఉన్న బలరామిరెడ్డిని తాత్కాలిక చైర్మన్‌గా నియమించారు. ప్రస్తుతం చైర్మన్ స్థానం ఖాళీగా ఉన్న మున్సిపాలిటీలన్నింటికీ ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో హిందూపురం మున్సిపల్ చైర్మన్ స్థానం కోసం ఫిబ్రవరి 3వ తేదీ ఎన్నిక జరగనుంది.

క్లుప్తంగా

పంట పొలాలకు నిప్పు



మంటలు ఆర్పుతున్న దృశ్యం

కదిరి అర్బన్: మండలంలోని ఎరుకులవాండ్లపల్లి సమీపంలో టోల్‌ప్లాజా వద్ద రోడ్డు పక్కన ఉన్న పొలాలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు రాజేశారు. దీంతో విపరీతమైన మంటలు ఎగిసి పడుతూ టోల్‌ప్లాజాను తాకాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ అధికారి మన్సూర్, సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు ఆర్పారు.

సర్వే పక్కాగా సాగాలి



మాట్లాడుతున్న డాక్టర్ నివేదిత

పుట్టపర్తి అర్బన్: అసంక్రమిత వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ చేపట్టిన సర్వే పక్కాగా సాగాలని ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ నివేదిత పేర్కొన్నారు. సోమవారం పుట్టపర్తి మండలం జగరాజుపల్లిలో చేపట్టిన సర్వేను ఆమె పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి అసంక్రమిత వ్యాధులపై పరీక్షలు నిర్వహించి, ప్రజలకు అవగాహన పెంపొందించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, పౌష్టికాహారంపై చైతన్య పరచాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నగేష్, పీహెచ్‌ఎన్ లలితాకుమారి, సూపర్‌వైజర్ వెంకటరమణ, ఎంఎల్‌హెచ్‌పీ అపర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

మంగళసూత్రం అపహరణ



బాధితురాలు భార్గవి

ఓడీచెరువు: వివాహిత దృష్టిని ఏమార్చి ఆమె మెడలోని బంగారు మంగళసూత్రాన్ని దుండగులు అపహరించుకెళ్లారు. పోలీసులు తెలిపిన మేరకు... ఓడీ చెరువు మండలం వేమారెడ్డిపల్లి సమీపంలోని కదిరి-హిందూపురం ప్రధాన రహదారి పక్కన దుకాణం వద్దకు సోమవారం ఉదయం ద్విచక్ర వాహనంపై ఇద్దరు యువకులు చేరుకున్నారు. దుకాణ నిర్వాహకురాలు భార్గవితో నీళ్ల బాటిల్ కొనుగోలు చేశారు. ఈ నేపథ్యంలో వారికి చిల్లర ఇచ్చేందుకు భార్గవి కిందకు తల వంచిన సమయంలో ఆమె మెడలోని బంగారు మంగళసూత్రాన్ని లాక్కొని ద్విచక్ర వాహనంపై ఉడాయించారు. ఆ సమయంలో ఆమె కేకలు వేసినా ఫలితం లేకపోయింది. దీంతో డయల్ 100కు బాధితురాలు ఫోన్ చేసి తెలపడంతో సమాచారం అందుకున్న ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి, సిబ్బంది అక్కడకు చేరుకుని ఘటనపై ఆరా తీశారు. అనంతరం గోరంట్ల వైపుగా గాలింపు చేపట్టినా చైన్‌స్నాచర్ల ఆచూకీ లభ్యం కాలేదు. ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ విద్య.. ఇకపై మిథ్య

- పాఠశాలల మూసివేతకు రంగం సిద్ధం
- కొత్త నిబంధనలతో నిర్వీర్యమవుతున్న విద్యారంగం





మూసివేతకు ప్రతిపాదించిన బైరాపురంలోని ప్రాథమిక పాఠశాల

పుట్టపర్తి: కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలతో ప్రభుత్వ విద్య ఇకపై మిథ్యగా మారనుంది. విద్యార్థుల సంఖ్య లేదంటూ పలు ప్రభుత్వ పాఠశాలల మూసివేతకు శరవేగంగా పావులు కదుపుతోంది. 117 జీఓకు ప్రత్యామ్నాయ మార్గదర్శకాలు రూపొందించి నెపాన్ని పూర్తిగా గత ప్రభుత్వంపై నెట్టి వేసే కుట్రకు తెర లేపింది. కూటమి ప్రభుత్వ నిర్ణయాలతో ప్రాథమిక విద్య సందిగ్ధంలో పడుతోందని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కనుమరుగు కానున్న ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు

ఇప్పటికే కూటమి ప్రభుత్వ వైఖరితో ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యమవుతున్నాయి. ఇంతటితో ఆగక గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల మూసివేతకు రంగం సిద్ధమైంది. గ్రామాల్లో ఉన్న రెండు, మూడు స్కూళ్లను విలీనం చేసి పంచాయతీ పరిధిలో ఓ స్కూల్ మాత్రమే నిర్వహించేలా కార్యాచరణను సిద్ధం చేసి, ఆ దిశగా పావులు కదుపుతున్నారు. ఫలితంగా గ్రామీణ ప్రాంతానికి చెందిన నిరుపేద విద్యార్థులు ఇకపై సుదూర ప్రాంతంలోని పాఠశాలకు వెళ్లలేక మధ్యనే చదువు మానేయాల్సిన పరిస్థితి రానుంది. కూటమి ప్రభుత్వం రూపొందించిన నూతన మార్గదర్శకాల మేరకు వచ్చే విద్యాసంవత్సరం ఈ విధానం అమలులోకి రానున్నట్లు విశ్వసనీయ సమాచారం.

10 లోపు విద్యార్థులున్న పాఠశాలలు 250..

జిల్లాలో ఇప్పటికే 10 ప్రాథమిక పాఠశాలల మూసివేతకు ప్రతిపాదనలు సిద్ధం కాగా, తాజాగా ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాల మేరకు పది మంది లోపు విద్యార్థులు ఉన్న 250 పాఠశాలలు మూత పడే బడుల జాబితాలోకి చేరాయి. ఈ క్రమంలోనే ఆయా పాఠశాలల నిర్వహణను ప్రభుత్వం గాలికి వదిలేసింది. మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. అపార్ నమోదు, రెసిడెన్సియల్ ట్రైనింగ్, తదితర కార్యక్రమాల పేరుతో ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తూ వచ్చింది. వైఎస్ జగన్ హయాంలో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ చేకూరింది. కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా ప్రభుత్వ బడులు రూపు దిద్దుకున్నాయి. దీనికి తోడు ఆధునిక సాంకేతికతను అంది పుచ్చుకుని నాణ్యమైన విద్యాబోధనను చేరువ చేశారు. పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో అమ్మఒడి పథకాన్ని అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తూ వచ్చారు. పిల్లలను బడికి పంపే తల్లుల బ్యాంక్ ఖాతాల్లోకి నేరుగా ఏడాదికి రూ.15 వేలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జమ చేస్తూ వచ్చింది. జగనన్న గోరు ముద్ద పేరుతో రోజుకో రుచికరమైన వంటకాన్ని చేసి విద్యార్థులకు అందజేస్తూ వచ్చారు. జగనన్న విద్యా కానుక కింద విద్యాసంవత్సరం ఆరంభానికి ముందే విద్యాసామగ్రిని అందజేసేవారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత విద్యాభివృద్ధికి గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలను పూర్తిగా తెరమరుగు చేసింది. ఫలితంగా పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గుతూ వస్తోంది. ఇదే అదనుగా విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందనే నెపంతో ఆయా పాఠశాలలను మూసివేతకు ప్రభుత్వం సిద్ధమవుతోంది.

జిల్లాలో ప్రభుత్వ బడులు ఇలా...	
జగన్ హయాంలో స్కూళ్ల సంఖ్య	2,596
కూటమి ప్రభుత్వంలో తొలిదశ మూసివేతకు ప్రతిపాదించిన పాఠశాలల సంఖ్య	10
జగన్ హయాంలో విద్యార్థుల సంఖ్య	1,47,000 మంది.
కూటమి ప్రభుత్వంలో విద్యార్థుల సంఖ్య	1,20,000 మంది

నిర్వహణ అధ్వానం

మా ఊళ్లో 2006–10 మధ్య కాలంలో ప్రాథమికోన్నత పాఠశాల ఉండేది. అప్పట్లో 160 మంది పిల్లలు చదువుకునేవారు. 2024 నుంచి పాఠశాల నిర్వహణను ప్రభుత్వం పూర్తిగా గాలికి వదిలేసింది. అయ్యవార్లను అదేదో ట్రైనింగ్‌లు, అపార్ అంటూ తిప్పడంతో పాఠాలు చెప్పేవారు లేకపోవడంతో చాలా మంది పిల్లలను పక్క ఊళ్లోని ప్రైవేట్ పాఠశాలలో చేర్పించాల్సి వచ్చింది. అమ్మఒడి పథకం అమలు చేయకపోవడంతో ఈ ఏడాది ఒక్క విద్యార్థి కూడా పాఠశాలలో చేరలేదు. వాళ్ల నిర్లక్ష్యం చేసి ఈ రోజు మా ఊళ్లో బడి మూసేస్తామని అంటే ఎలా? పల్లెల్లో ప్రభుత్వ బడులు కొనసాగించాలి. – బ్రహ్మానందరెడ్డి, బైరాపురం, కొత్తచెరువు మండలం

ఇదెక్కడి న్యాయం

ప్రతిపక్షంలో ఉన్నప్పుడేమో జీఓ 117ను రద్దు చేసి, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకువస్తామన్నారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత జీఓ 117 రద్దు మాట మరిచి, ప్రత్యామ్నాయ మార్గదర్శకాలంటూ మా ఊళ్లలో బడులు మూసి వేసేందుకు చర్యలు తీసుకోవడం సిగ్గు చేటు. ప్రభుత్వ నూతన మార్గదర్శకాలు అమలయితే పంచాయతీకి ఒక పాఠశాల కూడా మిగలదు. లోపాలు ఏవైనా ఉంటే సరిదిద్ది గ్రామాల్లో పాఠశాలలు కొనసాగించేలా చూడాలి అంతేకానీ, బడులు మూసేస్తామనడం భావ్యం కాదు. ఇంత కంటే అన్యాయం మరెక్కడా ఉండదు. – నరసారెడ్డి, చెరువుమరవపల్లి

కాలువలో మృతశిశువు



పుట్టపర్తి: బుక్కపట్నం చెరువు కాలువలో నెలలు పూర్తిగా నిండని మృత శిశువు లభ్యమైంది. బుక్కపట్నం చెరువు నుంచి రామస్వామి గుడి సమీపంలో ఆయకట్టుకు నీళ్లు పారుతున్నాయి. ఈ క్రమంలో కాలువ నడిమధ్య సోమవారం ఉదయం మృత శిశువు కొట్టుకువచ్చింది. అటుగా వెళ్లిన వారు గుర్తించి సమాచారం ఇవ్వడంతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కౌసల్యాసాయి అక్కడకు చేరుకుని పరిశీలించారు. నెలలు నిండక పోవడంతో పూర్తి స్థాయిలో అవయవాలు వృద్ధి చెందలేదని గుర్తించారు. మృత శిశువును ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

బైక్‌లు ఢీ... ఇద్దరి దుర్మరణం

దొడ్డబళ్లాపురం: ఎదురెదురుగా వచ్చిన బైక్‌లు ఢీకొని విద్యార్థితోపాటు ప్రైవేటు కంపెనీ ఉద్యోగి మృతిచెందారు. ఈ ఘటన రాజానుకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలోని యలహంక తాలూకా హొన్నేనహళ్లి గేట్ వద్ద చోటుచేసుకుంది. వివరాలు... ఏపీలోని హిందూపురానికి చెందిన తేజస్(20) రాజానుకుంట సమీపంలోని ప్రెసిడెన్సీ యూనివర్సిటీలో బీబీఏ చదువుతూ అక్కడే హాస్టల్‌లో ఉంటున్నాడు. సోమవారం బైక్‌పై కళాశాలకు వెళ్తుండగా హొన్నేనహళ్లి వద్దకు చేరుకోగానే ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన యలహంక తాలూకా అద్దెవిశ్వనాథపుర గ్రామ నివాసి పవన్(21) ఢీకొన్నాడు. ఘటనలో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. రాజానుకుంట పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

అదృశ్యమై.. జంటగా వచ్చారు!

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో చదువుతూ శనివారం అదృశ్యమైన ముగ్గురు విద్యార్థినులు సోమవారం ప్రత్యక్షమయ్యారు. ముగ్గురూ ప్రేమ వివాహాలు చేసుకుని రావడం గమనార్హం. శనివారం ఉదయం కాలేజీకి వెళ్లిన విద్యార్థినులు సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ధర్మవరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారి ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తుండగానే.. ముగ్గురు విద్యార్థినులూ ప్రేమ వివాహాలు చేసుకుని సోమవారం నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. పోలీసులు వారిని తహసీల్దార్ నటరాజ్ వద్దకు తీసుకెళ్లారు. ముగ్గురు విద్యార్థినుల్లో ఒకరు మైనర్ కావడంతో తల్లిదండ్రులకు అప్పగించారు. మిగిలిన ఇద్దరిని కూడా తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు వారి ఇళ్లకు పంపించారు.

భర్తే కాలయముడా?

- 14 ఏళ్ల క్రితం ప్రేమ వివాహం
- ఇటీవల భార్యపై అనుమానం
- హతమార్చి ఆత్మహత్యగా చిత్రీకరించే యత్నం!
- పోలీసుల అదుపులో అనుమానితుడు





మీనాక్షి (ఫైల్). అనుమానితుడు జయప్రకాష్

యల్లనూరు: ప్రేమించుకున్నారు... కాదన్న పెద్దలనూ ఒప్పించారు. అందరి సమక్షంలో పెళ్లి చేసుకున్నారు. పండంటి కాపురానికి చిహ్నంగా ముగ్గురు పిల్లలు ఉన్నారు. అయితే ఏమి జరిగిందో.. ఏమో... చిన్నపాటి అనుమానం పెనుభూతమైంది. 14 ఏళ్ల వివాహ బంధం అపహాస్యమై... చివరకు భార్య అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు.. యల్లనూరు మండలం శింగవరం గ్రామానికి చెందిన మాజీ డీలర్ సూర్యనారాయణ నాల్గో కుమార్తె మీనాక్షి (34), అదే గ్రామానికి చెందిన జయప్రకాష్ 14 ఏళ్ల క్రితం ప్రేమించి, పెళ్లి చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. పెళ్లి సమయంలో ఓ బ్యాటరీ కంపెనీలో పనిచేసే జయప్రకాష్... పదేళ్ల క్రితం తన ఉద్యోగం మానేసి స్వగ్రామానికి చేరుకుని వ్యవసాయ పనులతో కుటుంబాన్ని పోషించుకోసాగాడు.

సార్... నా భార్య ఆత్మహత్య చేసుకుంది!

ఆదివారం అర్ధరాత్రి యల్లనూరు పీఎస్‌కు జయప్రకాష్ చేరుకుని 'సార్.. నా భార్య ఆత్మహత్య చేసుకుంది' అంటూ డ్యూటీలో ఉన్న సిబ్బందికి సమాచారం అందించాడు. విషయం తెలుసుకున్న సీఐ సత్యబాబు, పుట్లూరు పీఎస్ ఎస్‌ఐ వెంకటనరసింహులు ఘటనపై జయప్రకాష్‌తో ఆరా తీశారు. తనకేమీ తెలియదని అర్ధనగ్నంగా ఇంట్లో పైకప్పునకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని జయప్రకాష్ తెలపడంతో పోలీసులు శింగవరం గ్రామానికి చేరుకుని పరిశీలించారు.

అనుమానాలన్నీ అయినవాడిపైనే..

మీనాక్షి ఆత్మహత్య ఉదంతం ఒక్కసారిగా గుప్పుమనడంతో శింగవరం గ్రామం ఉలిక్కిపడింది. అయితే ఆమె ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని, భర్తనే హతమార్చి ఆత్మహత్యగా చిత్రీకరించి ఉంటాడనే వదంతులు వ్యాపించాయి. దీనికి తోడు మీనాక్షి తల్లి లక్ష్మమ్మ సైతం తన కుమార్తె మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయడంతో పోలీసులు వెంటనే జయప్రకాష్‌ను అదుపులోకి తీసుకుని, అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, కొంత కాలంగా మీనాక్షి ప్రవర్తనపై అనుమానాలు పెంచుకున్న జయప్రకాష్ ఎలాగైనా ఆమెను వదిలించుకోవాలనే పథకం ప్రకారం తన అన్న శివశంకర్‌తో కలసి హతమార్చి అనంతరం తనపై ఎలాంటి అనుమానాలు రాకుండా మీనాక్షి మృతదేహాన్ని అర్ధనగ్నంగా చేసి ఉరి వేసి అందరి దృష్టి ఏమార్చే ప్రయత్నం చేశారనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఘటనపై వాస్తవాలు నిగ్గు తేల్చే దిశగా పోలీసుల విచారణ కొనసాగుతోంది.

వీసీలకు విశేషాధికారాలు

- హోదా కాలం ఐదేళ్లకు పెంచే యోచన
- మార్గదర్శకాలు జారీ చేసిన యూజీసీ



జేఎన్‌టీయూ అనంతపురం పాలక భవనం

అనంతపురం: వర్సిటీ వైస్ చాన్సలర్ (వీసీ)ల నియామకం, అర్హతలకు సంబంధించి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నూతన నిబంధనలు అమల్లోకి రానున్నాయి. తాజా నిబంధనలు అమల్లోకి వస్తే వీసీలకు విశేషాధికారాలతో పాటు వర్సిటీలపై రాష్ట్ర ప్రభుత్వ పాత్ర నామమాత్రం కానుంది. దీంతో వీసీల నియామకానికి సంబంధించిన సెర్చ్ కమిటీలో సభ్యుల ఎంపిక బాధ్యత పూర్తిగా గవర్నర్ విచక్షణాధికారంపై ఆధారపడి ఉంటుంది. ఇప్పటి వరకూ సెర్చ్ కమిటీలో యూజీసీ ప్రతినిధి, వర్సిటీ పాలకమండలి ప్రతినిధి, రాష్ట్ర ప్రభుత్వ నామినీతో కలిపి ముగ్గురు సభ్యులు ఉండేవారు. నూతన ముసాయిదా ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ నామినీ ఉండరు. గవర్నర్ నామినీ ఒకరు, యూజీసీ నామినీ ఒకరు, వర్సిటీ నుంచి ఒకరు ఉంటారు. ఇప్పటి వరకూ పదేళ్ల ప్రొఫెసర్‌గా అనుభవం ఉన్నవారు మాత్రమే వీసీ పోస్టుకు అర్హులు కాగా, తాజా ముసాయిదా ప్రకారం పదేళ్లు పనిచేయాలనే నిబంధనను సడలించారు. ఉన్నత విద్యా సంస్థల్లో ప్రొఫెసర్‌గా, మంచి పరిశోధకులుగా, పరిశ్రమల్లో మంచి అడ్మినిస్ట్రేటర్‌గా, పబ్లిక్ సెక్టార్ కంపెనీల్లో సీనియర్ స్థాయి అర్హతలు ఉన్న వారిని సైతం వీసీగా నియామకం చేయవచ్చు. అకడమిక్‌గాను మంచి రికార్డు ఉన్న వారిని వీసీగా నియమించేలా గవర్నర్ సిఫార్సు చేసే అవకాశం ఉంది. వాస్తవానికి వైస్‌చాన్సలర్ హోదా కాలం ప్రస్తుతం మూడేళ్లు కాగా, నూతన ముసాయిదా ప్రకారం వీసీగా నియామకమైనప్పటి నుంచి సదరు అధికారికి 70 సంవత్సరాల వయస్సు వచ్చే వరకు లేదా ఐదేళ్ల పాటు కొనసాగిస్తారు. ఆ తర్వాత మరోసారి నియామకానికి అర్హులుగా పరిగణిస్తారు.

కొత్త ముసాయిదా అమల్లోకి వచ్చేలోపే వీసీల ఖరారు

యూజీసీ వీసీల నియామకానికి సంబంధించి నూతన ముసాయిదా విడుదల చేయడంతో ఇది అమల్లోకి రాకముందే రాష్ట్రంలోని వర్సిటీలకు వీసీల నియామకం చేసే దిశగా కూటమి ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది. ఈ నేపథ్యంలో ఎస్కేయూ, జేఎన్‌టీయూఏకు ఈ నెల 22వ తేదీనే సెర్చ్ కమిటీ సమావేశం పూర్తయింది. వీసీగా నియమితలయ్యే వారి పేర్లతో కూడిన జాబితా సిద్ధమైంది. దీంతో నూతన వీసీలను త్వరలో ప్రకటించే అవకాశముంది. రాష్ట్రంలోని ఐదు టాప్ వర్సిటీలకు ఐఐటీ ప్రొఫెసర్లను వీసీలుగా నియామకం చేయనున్నారు. దీంతో జేఎన్‌టీయూఏకూ ఐఐటీ ప్రొఫెసర్ వీసీగా రానున్నారు. ఎస్కేయూకు అదే వర్సిటీలో పనిచేస్తున్న ప్రొఫెసర్లకు కాకుండా ఇతర వర్సిటీలకు చెందిన వారికి అవకాశం కల్పించనున్నట్లు తెలిసింది.

చట్ట పరిధిలో న్యాయం చేస్తాం : ఎస్పీ



బాధితురాలితో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందజేసే వినతులకు చట్ట పరిధిలో న్యాయ పరిష్కారం చూపుతామని బాధితులకు ఎస్పీ రత్న భరోసానిచ్చారు. జిల్లా పోలీసు కార్యాలయం వేదికగా సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 67 వినతులు అందాయి. ఎస్పీ స్వయంగా వినతులు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని వాటి పరిష్కారానికి చొరవ తీసుకోవాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, లీగల్ అడ్వైజర్ సాయినాథ్‌రెడ్డి, ఎస్పీ సీఏ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి పాల్గొన్నారు.

భోజన నాణ్యత పరిశీలన



విద్యార్థులతో మాట్లాడుతున్న డీడీ నిర్మలాజ్యోతి

చెన్నేకొత్తపల్లి: స్థానిక బీసీ బాలుర వసతి గృహంలో గణతంత్ర దినోత్సవం నాడు మధ్యాహ్నం విద్యార్థులకు భోజనం పెట్టకపోవడం వివాదాస్పదమైంది. ఘటనపై కలెక్టర్ ఆదేశాల మేరకు బీసీ వెల్ఫేర్ శాఖ డీడీ నిర్మలాజ్యోతి సోమవారం రాత్రి తనిఖీ చేశారు. వసతి గృహంలోని గదులను, బాత్రూమ్‌లు, మరుగుదొడ్ల పరిశీలించారు. భోజనాన్ని రుచి చూశారు. మెనూ ప్రకారం భోజనం, గుడ్డు, చికెన్ ఇస్తున్నారా? లేదా అంటూ విద్యార్థులతో ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఇన్‌చార్జ్ అధికారి నరసింహమూర్తికి సూచించారు.

హైకోర్టు ఉత్తర్వులు వెంటనే అమలు చేయాలి



కలెక్టరేట్ ఎదుట రిలే దీక్షల్లో పాల్గొన్న యానిమేటర్లు

ప్రశాంతి నిలయం: జిల్లాలో తొలగించిన వెలుగు వీఓఏలను హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వుల మేరకు తక్షణమే విధుల్లోకి తీసకోవాలంటూ ఆ సంఘం జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. డిమాండ్ సాధనలో భాగంగా కలెక్టరేట్ ఎదుట యానిమేటర్లు చేపట్టిన రిలేదీక్షలను సోమవారం ప్రారంభించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్, బ్యాళ్ల అంజి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చిరుద్యోగులపై కక్ష పూరితంగా వ్యవహరిస్తూ వస్తోందని మండిపడ్డారు. ఈ క్రమంలోనే వెలుగు యానిమేటర్లను నిర్దాక్షిణ్యంగా తొలగించారన్నారు. దీనిపై బాధిత యానిమేటర్లు హైకోర్టును ఆశ్రయిస్తే అనుకూలంగా ఉత్తర్వులు జారీ అయ్యాయన్నారు. ఈ ఉత్తర్వుల మేరకు బకాయి వేతనాలు చెల్లించడంతో పాటు తొలగించిన యానిమేటర్లను విధుల్లోకి తక్షణమే తీసుకోవాలని, లేకపోతే భవిష్యత్తులో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యానిమేటర్లు ఆదినారాయణ, శకుంతల, రామాంజినేయులు, సుభాషిణి, మల్లప్ప, నాగరాజు, కరుణాకర్‌రెడ్డి, గంగమ్మ, హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.